మరో మణిహారం 'నుడా'

- నాగరకర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు
- 18 మండలాల పరిధిలో 319 గ్రామాలను కలుపుతూ ఉత్తర్వులు



నాగర్‌కర్నూల్ పట్టణ వ్యూ

నాగర్‌కర్నూల్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2016వ సంవత్సరంలో నాగర్‌కర్నూల్ జిల్లాను ఏర్పాటు చేశారు. జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు నాగర్‌కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా)ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ ప్రాంతాలకు దీటుగా మరి కొన్ని గ్రామాలు కూడా అభివృద్ధి దిశలో ప్రయాణించనున్నాయి.

319 గ్రామాలు నుడా పరిధిలోకి..

నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉండగా 18 మండలాల పరిధిలోని 319 గ్రామాలను నుడాలో కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్‌తోపాటు మండల పరిధిలోని 21 గ్రామాలు, తాడూరు మండలంలోని 22 గ్రామాలు, తెలకపల్లి మండలంలోని 20 గ్రామాలు, బిజినేపల్లి పరిధిలోని 24 గ్రామాలు, తిమ్మాజిపేట పరిధిలోని 19 గ్రామాలు నుడా పరిధిలోకి రానున్నాయి. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో అచ్చంపేట మున్సిపల్‌తోపాటు మండల పరిధిలో 14 గ్రామాలు, వంగూరు మండలంలో 19 గ్రామాలు, చారకొండ పరిధిలో 07 గ్రామాలు, బల్మూరు పరిధిలో 17 గ్రామాలు, లింగాల పరిధిలో 18 గ్రామాలు, ఉప్పునుంతల పరిధిలో 23 గ్రామాలు నుడా పరిధిలోకి తీసుకురానున్నారు. కల్వకుర్తి పరిధిలో కల్వకుర్తి మున్సిపాలిటీతోపాటు మండల పరిధిలో 18 గ్రామాలు, వెల్దండ పరిధిలో 16 గ్రామాలు, ఊర్కొండ పరిధిలో 12 గ్రామాలు ఎంపిక చేశారు. ఇక కొల్లాపూర్ పరిధిలో కొల్లాపూర్ మున్సిపాలిటీతోపాటు కొల్లాపూర్ మండలంలో 17 గ్రామాలు, పెంట్లవెల్లి మండల పరిధిలో 8 గ్రామాలు, కోడేర్ పరిధిలో 18గ్రామాలు, పెద్దకొత్తపల్లి పరిధిలో 26 గ్రామాలు దీని పరిధిలోకి రానున్నాయి.

ఇక ప్రగతి పరుగులు...

నాగర్‌కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి రానున్న గ్రామాల్లో ఇక నుంచి అభివృద్ధి పనులు పరుగులు పెట్టనున్నాయి. హైదరాబాద్ వంటి మహానగరాల్లో జరిగే అభివృద్ధి పనులు ఇక్కడి గ్రామాల్లో సైతం జరిగే అవకాశం ఉంది. పట్టణీకరణతోపాటు పరిశ్రమలు, ఇతరత్రాల వ్యాపారాలు సైతం విస్తరించనున్నాయి. ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడనున్నాయి. నుడా పరిధిలోని పట్టణాలు, గ్రామాలకు కేంద్ర ప్రభుత్వ పట్టణ అభివృద్ధి పథకం ద్వారా నిధులు కూడా సమకూరనున్నాయి. రహదారులు, తాగునీరు, వీధి దీపాలు, కూడళ్లు, పార్కులు వంటి అన్నిరకాల అభివృద్ధి పనులు కొనసాగనన్నాయి. గ్రామాలు సైతం అభివృద్ధిలో పట్టణాలతో పోటీ పడనున్నాయి. ఇక లే అవుట్‌లు, ఇంటి నిర్మాణాలు నుడా పరిధిలోకి రానుండగా ఇళ్ల స్థలాల క్రయవిక్రయాల్లో జరిగే అక్రమాలకు తెరపడనున్నాయి.

కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ..

నాగర్‌కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు, నుడా మ్యాప్ రూపకల్పన ఇతర అంశాలపై ఒక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ చైర్మన్‌గా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, సభ్యులుగా మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్, ఆర్థిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది.

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో నాగర్‌కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. నాగర్‌కర్నూల్ ప్రజల తరుపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. నుడా ఏర్పాటుతో ఇక పల్లెలు కూడా పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందుతాయి. సకల సౌకర్యాలతో గ్రామాలకు కొత్త అందాలు సంతరించుకోనున్నాయి.

– డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కొల్లాపూర్: ఉచిత కంప్యూటర్ శిక్షణకు యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, డాటాఎంట్రీ కోర్సులలో శిక్షణ ఇస్తునట్లు పేర్కొన్నారు. 1వ తేదీ నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు ఆఫీస్ వద్ద రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయంలో శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు. పదో తరగతి పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొర్ర కేశవ

ఉప్పునుంతల: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొర్ర కేశవ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ప్రమీల అనారోగ్య సమస్యలతో దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో అచ్చంపేట ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కేశవకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతులు అప్పగించారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అన్యాయం



అమ్రాబాద్: దళితులను విభజిస్తూ ఇటీవల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అన్యాయమని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అనీల్ కుమార్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 27న ఆదివారం నాగర్‌కర్నూల్‌లో జరిగే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కోరారు. శనివారం మండల కేంద్రమైన పదరలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆనంద్‌కుమార్, రాజు, బాలింగయ్య, ఈశ్వర్, రవికుమార్, వెంకటయ్య, బాలు తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ మినీ స్టేడియం పేరు మార్చొద్దు

ఉప్పునుంతల: అచ్చంపేట పట్టణంలో ఉన్న ఎన్టీఆర్ మినీ స్టేడియం పేరు మార్చొద్దని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మన్నె విష్ణు శనివారం ఒక ప్రకటనలో కోరారు. మినీ స్టేడియంకు రాజీవ్‌గాంధీ పేరు పెట్టాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులను కూలీ పనులకు తీసుకెళ్లొద్దు



నాగర్‌కర్నూల్ క్రైం: పాఠశాలకు వెళ్లే విద్యార్థులను కూలీ పనులకు తీసుకెళ్లొద్దని బ్లూకోర్ట్ కానిస్టేబుల్ చిన్న అన్నారు. శనివారం మండలంలోని తూడుకుర్తి గ్రామ సమీపంలో ఆటో డ్రైవర్లకు బాలల హక్కులు, బాల కార్మికుల వ్యవస్థ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను దినసరి కూలీ పనులకు తీసుకెళ్లడం చట్టరిత్యా నేరమన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి వేణుగోపాల్, చైల్డ్ హెల్ప్ లైన్ మెంబర్లు సురేష్, కవిత పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలతో సృజనాత్మకత



తాడూరు: చిత్రలేఖనం పోటీలతో సృజనాత్మకత పెంపొందుతుందని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు పలు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతి వారం తరగతి గదికే పరిమితం కాకుండా ఇతర అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిప్ంచి అన్ని రంగాల్లో రాణించేవిధంగా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అచ్చంపేట రూరల్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శనివారంపట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఉప్పునుంతల మండలం కాంసానిపల్లికి చెందిన ట్రాక్టర్ యజమాని హుస్సేన్, డ్రైవర్ వంగూరు శివ(సాయి)పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రమణ తెలిపారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం

చారకొండ: ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దామని కాంప్లెక్స్ హెచ్‌ఎం భగవాన్ రెడ్డి కోరారు. మండలంలోని నూకలచింత వాడిక తండా, ఎంపీపీఎస్ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని విద్యార్థుల సంఖ్య పెంచేవిధంగా తల్లిదండ్రులు, గ్రామ యువకులకు అవగాహన కల్పించారు. అనంతరం తుర్కలపల్లి, తిమ్మాయిపల్లి పాఠశాలలను సందర్శించారు. వారి వెంట సీఆర్పీ యాదయ్య, ఉపాధ్యాయులు ,గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం



కల్వకుర్తిరూరల్: హామీల అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న అన్నారు. శనివారం పట్టణంలో ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. నూతన అధ్యక్షుడుగా ఎన్నికై మొదటిసారి కల్వకుర్తికి వచ్చిన బోనాసి రాంచందర్‌ను సన్మానించారు. బీఎస్పీ కల్వకుర్తి అసెంబ్లీ అధ్యక్షుడిగా బాలు నియామకం అయ్యారు. కార్యక్రమంలో యూసూఫ్, ఆంజనేయులు, వెంకటయ్య, మహేష్, రమేష్, రేణుక, పారిజాతం, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ

తెలకపల్లి: విద్యార్థుల విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ బాలికల పాఠశాలను, గౌరెడ్డిపల్లిలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యతగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. హెచ్‌ఎం సుదర్శనాచార్యులు, ఐఆర్‌పీ బాల్‌నర్సింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలింపు

లింగాల: మండలంలోని ఎర్రపెంటకు చెందిన చెంచు వ్యక్తి నిమ్మల శంకర్ గత నెల 28న నల్లమల ప్రాంతంలో అదృశ్యమయ్యాడు. నెల రోజులు కావొస్తున్న ఆచూకీ దొరక్క పోవడంతో పెంటకు చెందిన చెంచులు, మహిళలు అడవిలో గాలిస్తూనే ఉన్నారు. లింగాల, మన్ననూర్ అటవీ శాఖ సిబ్బందితో పాటు అప్పాపూర్ మాజీ సర్పంచు బాలగుర్వయ్య, శ్రీరంగాపూర్ మాజీ సర్పంచు భర్త సన్నయ్య ఆధ్వర్యంలో చెంచులు, వాచర్లు బృందాలుగా విడిపోయి వెతుకుతున్నారు. రెండు రోజులుగా అటవీ ప్రాంతంలోని చింతగూడెం, తప్పెటగూడెం, దయ్యంబక్కా, దుకంపెంట, బిక్కిటిపెంట తదితర ప్రాంతాలలోని గుట్టలు, గుహలు, చెట్ల పొదల్లో వెతికినా ఎక్కడ కూడా ఆనవాళ్లు కూడా కనిపించలేదు.

నర్సరీ స్థలాల పరిశీలన

కోడేరు: మండలంలోని జనుంపల్లిలో నర్సరీ స్థలాన్ని ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో నర్సరీలకు మట్టిని తరలించాలని సూచించారు. నవంబర్ చివరి వరకు నర్సరీలో విత్తనాలు నాటాలన్నారు. హరిత హారం కింద మొక్కలు పెంచాలని సిబ్బందికి సూచించారు. ఏపీఓ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున్,కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేత

అమ్రాబాద్: మండలంలోని తిర్మలాపూర్(బీకే) గ్రామానికి చెందిన దేవయ్య అనే రైతు పాడి ఆవు రెండు నెలల కిందట సమీప అటవీప్రాంతంలో మేస్తూ ఉండగా పెద్దపులి దాడి చేసి చంపింది. ఈ మేరకు అటవీశాఖ అధికారులు నారయ్యకు నష్టపరిహారం కింద శనివారం అమ్రాబాద్ అటవీశాఖ కార్యాలయంలో రూ.14000 చెక్కును అందజేశారు. డిప్యూటీ రేంజర్ వాణి, ఎఫ్‌బీఓ నాగేష్‌లు ఉన్నారు.

ఏబీవీపీ టౌన్ కమిటీ ఎన్నిక

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో శనివారం ఏబీవీపీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాలమూరు, నాగర్‌కర్నూల్ రెండు జిల్లాల సంఘటన మంత్రి మల్లికార్జున్ పాల్గొని మాట్లాడారు. దేశంలో అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్ సంస్థ ఏబీవీపీ అని అన్నారు. కార్యదర్శిగా శేఖర్, రమేష్, శివ, ఉదయ్, సమీర్, శివరాం, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడుతాం



కొల్లాపూర్: విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శివశంకర్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌ఐడీ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశం అయ్యారు. కళాశాలల్లోని మౌలిక వసతుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావొస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో కొల్లాపూర్ నగర కమిటీని ఎన్నుకున్నారు. ఏబీవీపీ నగర కార్యదర్శిగా గాజుల నందిభాస్కర్‌ను నియమించారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



లింగాల: మండలంలోని అప్పాయపల్లి, చెన్నంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను శనివారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పొట్టేళ్ల పిల్లలు మృత్యువాత

బిజినేపల్లి: కుక్కల దాడిలో పొట్టేళ్ల పిల్లలు మృత్యువాత పడిన ఘటన శనివారం మండలంలోని గంగారం గ్రామం పరిధిలోని అలుగుతండాలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం నార్యనాయక్, చాందీ దంపతులు పోట్టేళ్ల పిల్లలను ఇంటి వద్ద ఇనుప జాలీలో ఉంచి బయటకు వెళ్లారు. వీధి కుక్కలు ఇనుప కంచెను దాటుకుని పొట్టేళ్ల పిల్లలపై దాడి చేసి చంపివేశాయి. బాధితులు ఇంటికి వచ్చి చూసే సరికి పోటేళ్లు మృత్యువాత పడటంతో బోరున విలపించారు. రూ. లక్ష వరకు నష్టం వాటిల్లిందని, అధికారులు తమను ఆదుకోవాలని కోరారు.

ప్రతి గింజను కొంటాం



బల్మూర్: రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో ప్రభుత్వం కొంటుందని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో శనివారం రాత్రి ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిరా క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనారాయణ, ఏడీ చంద్రశేఖర్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ రాఘవులు, ఏపీఎం చిట్టెమ్మ, ఏఓ నరేష్, కార్యదర్శి లక్ష్మణ్, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు సంపంగి రమేష్, ఖదీర్, ఎల్లికంటి శ్రీనువాసులు, వెంకటయ్య, చంద్రమౌళి, ఐకేపీ సిబ్బంది కాంత్‌రావు, రూప్‌సింగ్, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు సువర్ణ, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని తనిఖీ చేసిన జడ్జి



కొల్లాపూర్: పట్టణంలోని విశ్వశాంతి వృద్ధాశ్రమాన్ని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ జ్యోత్స్న గుంటి తనిఖీ చేశారు. ఆశ్రమంలో వృద్ధులకు కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్రెడ్లు పంపిణీ చేశారు. పిల్లలు ఉన్నవారు కూడా వృద్ధాశ్రమాల్లో చేరడం బాధాకరమన్నారు. ఆమె వెంట లోక్‌అదాలత్ ఇన్‌చార్జ్ భోగా హరికృష్ణ, పారాలీగల్ వలంటీర్ మధుసూదన్‌రావు తదితరులు ఉన్నారు.

కరపత్రం విడుదల

చారకొండ: ధర్మ సమాజ్ పార్టీ వార్షికోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు మహా సమ్మేళనం కరపత్రాలను విడుదల చేశారు. వచ్చే నెల 3న ఆదిబట్లలో నిర్వహించే మహాసమ్మేళనానికి పార్టీ శ్రేణులు, అభిమానులు, బహుజనులు అధికంగా పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మహారాజ్ కోరారు. నాగార్జున, వెంకటేష్, మల్లేష్, కొండల్, అయోధ్య, ఆంజనేయులు, రాములు మల్లికార్జున్, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ వితరణ



అచ్చంపేట రూరల్: వృద్ధులు, దివ్యాంగులను దృష్టిలో ఉంచుకొని శనివారం ఉమామహేశ్వర ఆలయానికి హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన హోమియోపతి వైద్యురాలు స్వాతి, శ్రీనివాస్‌లు వీల్‌చైర్‌ను వితరణ చేశారు. అదేవిధంగా నిత్యాన్నదానానికి రూ. 5వేలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాస్‌రావు దాతలను సన్మానించారు. కట్ట శేఖర్‌రెడ్డి, పవన్, లక్ష్మయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల 27న సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న స్వేరోస్ నేషనల్ కన్వెన్షన్ బహిరంగ సభను విజయవంతం చేయాలని స్వేరోస్ జిల్లా నాయకులు గిద్దె విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం పట్టణ కేంద్రంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు శివశంకర్, మబ్బురాము, సంపత్‌కుమార్, మల్లేష్, నాగలక్ష్మన్, శ్రీకాంత్, శ్రీదర్, సత్యం పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పెద్దకొత్తపల్లి: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని టీహెచ్‌ఎస్ కళాకారుల టీం లీడర్ భాస్కర్ అన్నారు. శనివారం కల్వకోల్‌లో టీహెచ్‌ఎస్ కళాకారుల బృందం మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృష్ణ, శివనాగులు, నరేందర్, శివయ్య, సికిందర్, పార్వతమ్మ, రేణుకలు పాల్గొన్నారు.

ద్విచక్రం వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

చారకొండ: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ షంషుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన కేశమోని శ్రీనివాస్ గౌడ్ (54) సిర్సనగండ్ల పని నిమిత్తం వెళ్లి తిరుగుప్రయాణం అయ్యారు. శాంతిగూడెం సమీపంలోని మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌గౌడ్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యాకమిషన్ సభ్యుడికి సన్మానం

చారకొండ: ఇటీవల రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడిగా ఎంపికైన చారకొండ వెంకటేష్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నకినమోని వెంకటయ్య యాదవ్, జూపల్లి నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అంకిల్ల రామస్వామి, బాత్క జంగయ్య, శ్రీకాంత్ ఉన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన



నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని దేశిటిక్యాలకు చెందిన దళిత భాగ్యమ్మ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని కోరుతూ శనివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ తీగ తెగి మృతి చెందిన భాగ్యమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

కూరగాయల సాగు చేసుకోవాలి

బల్మూర్: చెంచులు పెరటి తోటల్లో కూరగాయల సాగు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి కోరారు. మండల కేంద్రంలోని చెంచు కాలనీలో కోనేరు స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో పెంచుతున్న పెరటి తోటలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చెంచులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చెంచుల అభివృద్ధి కోసం కోనేరు సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

అధిక సాంద్రత పత్తిసాగుపై క్షేత్ర ప్రదర్శన



తాడూరు: మండలంలోని కుమ్మెర, తుమ్మలసూర్, పర్వతాయిపల్లి, వసంతాపూర్ గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం పాలెం ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తిసాగు యాజమాన్యంపై శనివారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా టీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతి సాగులో ప్రభావవంతమైన న్యూమాటిక్ ప్లాంటర్‌తో నాటే విధానం గురించి వివరించారు. శాస్త్రవేత్త డా బి రాజశేఖర్ మాట్లాడుతూ పత్తి పంట, కోత, మార్కెటింగ్, యాజమాన్యం వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు రామకృష్ణ, రఘువరన్‌సింగ్, కేవీపీఎస్ సిబ్బంది పుష్పలత, జ్ఞానేశ్వర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కల్వకుర్తి: విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ అన్నారు. శనివారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఐఎన్‌టీయూసీ అనుబంధం 327 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఎగురవేశారు. కృష్ణ, రఘు, కేశవ్, చంద్రశేఖర్, వరప్రసాద్, శాంతయ్య, రవి, జహంగీర్, స్వాతి పాల్గొన్నారు.

ఎస్‌ఐని విధుల నుంచి తొలగించాలి



లింగాల: ముగ్గురు యువకులకు శిరోముండనం చేయించిన ఎస్‌ఐ జగన్మోహన్‌ను విధుల నుంచి తొలగించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. లింగాలలో ఈ నెల 14న ముగ్గురు యువకులకు శిరోముండనం చేయించిన ఘటనకు సంబంధించి శనివారం పౌరహక్కుల సంఘం రాష్ట్ర, ఉమ్మడి జిల్లా నాయకులు బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పూర్తి సమాచారం సేకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎస్‌ఐ జగన్మోహన్ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని యువకులను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు శిరోముండనం చేయించడం హేయమైన చర్యన్నారు. యువకులను మూడు రోజులపాటు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచుకొని చిత్రహింసలకు గురిచేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. యువకులు తప్పు చేస్తే చట్టపరంగా శిక్షించాల్సిన పోలీసులు.. రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవర్తించారన్నారు. శిరోముండనం చేయించడాన్ని అవమానంగా భావించిన ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించగా.. అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడని అన్నారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నా రని ఆరోపించారు. ఇందులో రాజకీయ జోక్యం చోటు చేసుకోవడం సమంచితం కాదన్నారు. ఎస్‌ఐని విధుల నుంచి తొలగించి, పూర్తి స్థాయి లో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమా ండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర సహా య కార్యదర్శి రఘునాథ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుభాన్, ప్రధాన కార్యదర్శి జక్కు బాల య్య, కార్యవర్గ సభ్యుడు బాలయ్య ఉన్నారు.

వాసవీక్లబ్‌లకు అవార్డుల పంపిణీ

పెద్దకొత్తపల్లి: ఉత్తమ సేవలు అందించిన వాసవీక్లబ్‌లకు శనివారం భాస్కర్‌గుప్తా, అకీస్‌రాజేష్, వాసవీక్లబ్ రీజియన్ చైర్మన్ పోలిశెట్టి మల్లేష్ అవార్డులు అందజేశారు. చంద్రమౌళి, లక్ష్మణ గుప్తా, శ్రీదేవి, సుధాకర్, రామకృష్ణ, సురేష్, ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ధర్నా

అచ్చంపేట రూరల్: స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, సాయియాదవ్, అంజి, విజయ్‌రాజు, ప్రవీణ్, మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

బిజినేపల్లి: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన హీర్యా గుండె శస్త్ర చికిత్స కోసం రూ.3.5 లక్షల ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. గిరిజన నాయకుడు గోవింద్‌నాయక్, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

